## పోటెత్తిన బాసర

- సరస్వతీ అమ్మవారి దర్శనానికి బారులుదీరిన భక్తజనం
- దర్శించుకున్న రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి
- నేటి నుంచి వసంతోత్సవాలు


బాసర, ఫిబ్రవరి 11 : బాసర సరస్వతీ అమ్మవారి దర్శనానికి ఆదివారం భక్తులు పోటెత్తారు. ఆదివారం సెలవు దినం కావడంతో అధిక సంఖ్యలో తరలి వచ్చారు. ఆలయంతోపాటు పరిసర ప్రాంతాలు భక్తులతో కిటకిటలాడాయి. ప్రసాద కౌంటర్ వద్ద క్యూ కనిపించింది. ఇబ్బందులు కలుగకుండా అధికారులు చర్యలు తీసుకున్నారు. కాగా.. బాసర సరస్వతీ అమ్మవారిని తెలంగాణ రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం న్యాయమూర్తి అలిశెట్టి లక్ష్మీనారాయణ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. ఆయనకు అధికారులు స్వాగతం పలికిన అనంతరం ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శరథ్‌పాఠక్, ఏఈవో సుదర్శన్‌లు ఉన్నారు.

### నేటి నుంచి వసంత పంచమి ఉత్సవాలు

అమ్మవారి వసంత పంచమి వేడుకలు సోమవారం నుంచి ప్రారంభం కానున్నాయి. 12వ తేదీ నుంచి 14వరకు ఉత్సవాలు జరుగనున్నాయి. భక్తులు అధిక సంఖ్యలో వచ్చే అవకాశం ఉండడంతో అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులకు ఇబ్బంది కలుగకుండా చర్యలు తీసుకున్నట్లు తెలిపారు.


అమ్మవారి సన్నిధిలో భక్తుల సందడి

# రైతుబంధు రాకపాయే..



## రెండు నెలలుగా ఎదురు చూస్తున్న రైతన్నలు

- యాసంగిలో మూడెకరాల లోపు ఇచ్చి ఆపేసిన కాంగ్రెస్ సర్కారు
- గత సీజన్‌లో ఈ సమయానికి డబ్బులిచ్చిన కేసీఆర్ ప్రభుత్వం
- అప్ప కోసం వడ్డీ వ్యాపారులు, దళారుల చుట్టూ తిరుగుతున్న అన్నదాతలు
- కాంగ్రెస్ సర్కారు తీరుపై దుమ్మెత్తి పోస్తున్న కర్షకులు

ఆదిలాబాద్/నిర్మల్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ) : కేసీఆర్ సర్కారు హయాంలో యాసంగి, వానకాలాలకు సంబంధించిన రైతుబంధు డబ్బులు రైతుల ఖాతాల్లో ఠంచన్‌గా జమయ్యేవి.యేడాదికి రెండు సార్లు(సీజన్‌కు రూ.5 వేల చొప్పున) రెండు సీజన్‌లకు రూ.10 వేలు వచ్చేవి. సాగుకు ముందే డబ్బులు బ్యాంకు ఖాతాల్లో జమ అవడంతో రైతులు కూడా పెట్టుబడికి ఢోకా లేకుండా సాగు చేసుకునే వారు. విత్తనాలు, ఎరువులు, రసాయనిక ఎరువులను కొనుగోలు చేసి నిశ్చింతగా ఉండేవారు. యాసంగి సీజన్‌లో ఈ సమయానికి భూములన్నీ పంటలతో కళకళలాడేవి. కాగా.. కేసీఆర్ సర్కారు ఈ యాసంగిలో రైతుబంధు డబ్బులు వేయడానికి సిద్ధమైంది. ఇంతలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో ప్రక్రియ నిలిచిపోయింది. ఎన్నికల ప్రక్రియ పూర్తి కావడం, కాంగ్రెస్ పార్టీ అమలుకాని హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చింది. ఇప్పటివరకు మూడెకరాలు ఉన్న రైతులకు మాత్రమే డబ్బులను జమ చేసింది. అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటుతున్నా..అందరి ఖాతాల్లో డబ్బులను జమ చేయలేదు. దీంతో కొందరు రైతులు పెట్టుబడి కోసం దళారుల చుట్టూ తిరగాల్సి వచ్చింది. మరికొందరు పెట్టుబడి లేక పంటలు వేయలేదు. ఫలితంగా బీడు భూములు దర్శనమిస్తున్నాయి. దీంతో కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అన్నదాతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం వెంటనే సాయన్ని పంపిణీ చేయాలని రైతులు కోరుతున్నారు.

**కుమ్రం భీం ఆసిఫాబాద్ జిల్లావ్యాప్తంగా** ఈ యాసంగి సీజన్‌లో 1,31,518 మంది రైతులకు రైతుబంధు రావాలి. వీరికి రూ.132.87 కోట్లు అందాలి. కానీ.. ఇప్పటివరకు 16,590 మందికి రూ.4.25 కోట్ల సాయం అందింది.

**మంచిర్యాల జిల్లాలో** 1,52,234 మంది రైతులకు రూ.169.98 కోట్లు రావాలి. ఇప్పటివరకు 1,15,932 మందికి రూ.72.50 కోట్లు మాత్రమే ఇచ్చారు.

**నిర్మల్ జిల్లావ్యాప్తంగా** 1.33 లక్షల మందికి సాయం అందింది. ఇంకా 55 వేల మందికి అందాల్సి ఉంది.

**ఆదిలాబాద్ జిల్లాలో** 1,64,124 మంది రైతులు రైతుబంధు పథకానికి అర్హులు. కాగా.. రూ.286 కోట్లు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ కావాలి.

### తెలిసిన కాడ రూ.50 వేల బాకీ తెచ్చిన..



*నాకు కుంటాల మండల కేంద్రం లోని శివారులో 4.11 ఎకరాల ఎవుసం భూమి ఉన్నది. బోరు కింద పెసర, నువ్వులు, మక్క, జొన్న పంటలు ఏసిన. ఇప్పటి దాక రైతుబంధు రూపాయి కూడా రాలే. పంటలకు పురుగు మందులు సల్లేందుకు పైసలు లేవు. నిన్ననే భైంసాకు పోయి తెలిసినోళ్ల కాడ రూ.50 వేలు బాకీ తెచ్చిన. కేసీఆర్ ఉన్నప్పుడే రైతులకు అన్ని మంచిగుండే. టైంకు రైతుబంధు సాయం అస్తుండే. ఈ కాంగ్రెసోళ్లు అచ్చినంక పింఛన్ కూడా సక్కగ అస్తలేదు. నా మనవడికి వికలాంగ పింఛన్ ఇంకా రాలే.*

**- జాదవ్ నాందేవ్, రైతు, రాజాపూర్ తండా, కుంటాల మండలం.**



### డబ్బులు ఇంకెప్పడిస్తరు..



*తాంసి, ఫిబ్రవరి 11 : కేసీఆర్ సీఎంగ ఉంటే ఇద్వరకు రైతుబంధు ఎప్పుడో అస్తుండె. రెండో పంటకు పెట్టుబడి ఖర్చు పెడ్తుంటిమి. మా కుటుంబానికి హస్నాపూర్ శివారుల ఐదెకరాల భూమి ఉంది. దీంట్ల మూడెకరాల్లో పత్తి, రెండెకరాల్లో మిర్చి ఏసిన. పత్తుల ధరలు నిరుటి అంత కూడా లేవు. మిర్చి పంట సమయం రాలె. ఎట్ల చెయ్యాల్నో అర్థం కావాట్లే. కాంగ్రెస్ సర్కారు గిట్ల రైతులతోటి ఆడుకుంటదని అనుకోలేదు. రైతుబంధు ఇగ ఇస్తరో.. ఇయ్యరో తెలియట్లేదు.*

**- కోరుట్ల అశోక్, రైతు, హస్నాపూర్.**

### కేసీఆర్ సార్ యాదికొస్తున్నడు..



*తాంసి, ఫిబ్రవరి 11 : మా కుటుంబానికి మూడెకరాల భూము న్నది. గిప్పుడు చేండ్ల పత్తి పంట కాలం అయిపోయింది. గీ పత్తి జాగల రెండో పంటగా శనగ పంట అప్పు తెచ్చి మరి వేసిన. ఇగో ఇద్వారి దాక రైతుబంధు జాడ లేదు. ఏండ్ల సంది కేసీఆర్ సారు మా బ్యాంకు ఖాతాల్లో గీ టైమ్‌కు ఏసేస్తుండే. గా పైసల్ని బట్టి ఎవుసం పని నడుస్తుండే. కొందరు రెండో పంట ఏసి నెలయ్యింది. ఇగ, రైతుబంధు భరోసా లేదని మా గ్రామంల అంటున్నరు. ఇగో నిజం చెప్పాలంటే గిప్పుడు అందరికీ కేసీఆర్ సారు మతికస్తున్నడు. ఇప్పటికైనా సర్కారు రైతుబంధు పైసలియ్యాలె.*

**- దేవరకొండ దీపక్, రైతు, హస్నాపూర్**

### కాంగ్రెస్‌పై నమ్మకం పోయింది..



*ఆదిలాబాద్ జిల్లా భీంపూర్ మండల కేంద్రంలోని శివారులో మా కుటుంబానికి ఆరెకరాల వ్యవసాయ భూమి ఉంది. ప్రధానంగా పత్తి, కంది సాగు చేస్తాం. రెండో పంటగా శనగ, వేరు శనగ వేస్తా. కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు రైతుబంధు డబ్బులు పెట్టుబడి సమయానికి వచ్చేవి. కాంగ్రెస్ సర్కారొచ్చిన తర్వాత మా గ్రామంల 90 శాతం మందికి రైతుబంధు డబ్బులు రాలె. ఈసారే పెట్టుబడికి ఇబ్బంది పడుతున్నం. అప్పులు తెచ్చి సాగు చేస్తున్నం. రెండు నెలలకే కాంగ్రెసోళ్లపై నమ్మకం పోయింది. ఇప్పటికైనా పైసలు బ్యాంకు ఖాతాలో జమ చేయాలి.*

**- ఉత్తం రాథోడ్, రైతు, (భీంపూర్)**

## నేడే ప్రజాదర్బార్

- ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూర్తి
- మూడో రోజు కొనసాగిన నాగోబా జాతర
- బాను, పెర్సపేన్‌లకు ప్రత్యేక పూజలు


మర్రిచెట్ల వద్ద ఉన్న కోనేరుకు పూజలు చేస్తున్న కొత్తకోడళ్లు, ఆడబిడ్డలు


నాగోబా జాతరకు తరలివస్తున్న భక్తులు


నాగోబా పేరిట ఆవును వదులుతున్న మెస్రం వంశీయులు

ఇంద్రవెల్లి, ఫిబ్రవరి 11 : నాగోబా ఉత్సవాల్లో భాగంగా మూడో రోజైన ఆదివారం మెస్రం వంశీయులు ఆలయం వెనుక గల పెర్సపేన్(పెద్ద దేవుడు) దేవతకు సంప్రదాయ పూజలు నిర్వహించారు. డోల్, సన్నాయి, కాలికోమ్ వాయిస్తూ మెస్రం వంశీయుల పీఠాధిపతి వెంకట్‌రావ్‌పటేల్‌తోపాటు మెస్రం వంశీయుల పటేళ్లు చిన్ను పటేల్, బాజీరావ్ పటేల్ ఆధ్వర్యంలో కోసు కటోడ, కటోడ కోసేరావ్, కటోడ హనుమంత్‌రావ్‌లు పూజలు చేశారు. గోదావరి నుంచి తీసుకొచ్చిన గంగాజలంతో పెర్సపేన్‌కు అభిషేకం చేశారు. నవధాన్యాలతో నైవేద్యం వండి మొక్కులు చెల్లించుకుని, సహపంక్తి భోజనాలు చేశారు.

### బాన్ దేవతకు పూజలు

నాగోబా ఆలయం వెనుక భాగంలో ఉన్న బాన్ దేవతలకు మెస్రం వంశీయుల మహిళలు గిరిజన సంప్రదాయం ప్రకారం పూజలు చేశారు. గోవాడ్‌లో విశ్రాంతి పొందుతున్న మహిళలతోపాటు కొత్తకోడళ్లను సంప్రదాయ వాయిద్యాల మధ్య సతీదేవతల వద్దకు తీసుకొచ్చారు. గిరిజన మహిళలతోపాటు కొత్తకోడళ్లు మట్టికుండలతో కోనేరు వద్దకు వెళ్లారు. మెస్రం వంశీయుల అల్లుళ్లు నీటిని తోడి మట్టికుండలతోపాటు బిందెల్లో నీరు పోశారు. అనంతరం మహిళలు మట్టికుండలను తలపై పెట్టుకుని బాన్‌దేవతల వద్దకు వచ్చారు. నీటిని కలుపుతూ ఏడు వరుసలతో కూడిన బౌలదేవతను తయారు చేశారు. వీటికి కొత్తకోడళ్లు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు. కాగా.. గోవాడ్‌లో కొత్త కోడళ్లకు నాగోబా చరిత్ర, సంస్కృతీ సంప్రదాయాలను మెస్రం వంశీయుల ఆధ్వర్యంలో పర్ధాంజీలు మెస్రం రాము, గంగారాం కిక్రి వాయిస్తూ అవగాహన కల్పించారు.


బాన్‌దేవత పూజలకు వచ్చిన మహిళలు


బాన్‌దేవత ఆలయం నుంచి కోనేరుకు వెళ్తున్న కొత్తకోడళ్లు, ఆడపడుచులు

### నేడే ప్రజాదర్బార్

నాగోబా జాతర సందర్భంగా ఐటీడీఏ ఆధ్వర్యంలో యేటా ప్రజాదర్బార్‌ను నిర్వహిస్తారు. ప్రజాదర్బార్‌కు మంత్రులతోపాటు జిల్లాస్థాయి అధికారులు హాజరై ఆదివాసీ గిరిజనుల సమస్యలను పరిష్కరిస్తారు. ఐటీడీఏ ఆధ్వర్యంలో ప్రజా ఫిర్యాదుల విభాగాలను ఏర్పాటు చేసి దరఖాస్తులను స్వీకరిస్తారు. ఐటీడీఏ ద్వారా మంజూరైన సంక్షేమ పథకాలను అక్కడే పంపిణీ చేస్తారు.

### దర్బార్‌కు మంత్రి సీతక్క రాక

నాగోబా జాతర సందర్భంగా నిర్వహించే ప్రజాదర్బార్‌కు గిరిజన సంక్షేమ శాఖ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్కతోపాటు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తా వస్తున్నట్లు ఆలయ ఈవో రాజమౌళి తెలిపారు.


పెర్సపేన్ దేవతకు నైవేద్యాలు సమర్పిస్తున్న కటోడ కోసు


బాన్‌దేవత వద్దకు పుట్టలకు పూజలు చేస్తున్న మెస్రం బాజీరావ్‌పటేల్


బాన్‌దేవత పూజల్లో పాల్గొన్న మహిళలు

## ప్రగతికి బ్రేక్

- ఆర్‌అండ్‌బీ పరిధిలో నిలిచిన రూ.400 కోట్ల అభివృద్ధి పనులు
- కేసీఆర్ సర్కారు హయాంలో మంజూరైన పనులకు అడ్డంకులు
- రాజకీయ కోణంతోనే ఆటంకాలు.. కాంగ్రెస్ సర్కారుపై విమర్శలు
- తల్లడిల్లుతున్న తండాలు.. పనులు చేపట్టాలని ప్రజల డిమాండ్..


కడెం మండలంలోని పాండవాపూర్ నుంచి డ్యాంగూడ వరకు నిలిచిన రోడ్డు పనులు


కడెం మండలంలో ఆర్‌అండ్‌బీ రోడ్డు నుంచి అల్లంపెల్లి వరకు నిలిచిన రోడ్డు పనులు

నిర్మల్, ఫిబ్రవరి 11(నమస్తే తెలంగాణ) : నిర్మల్ జిల్లాలోని గిరిజన గూడేలు, తండాలు, పల్లెలు వసతులు లేక తల్లడిల్లాయి. సమస్యల పరిష్కారానికి కేసీఆర్ సర్కారు దాదాపు రూ.400 కోట్లు కేటాయించింది. ఇందులో రోడ్లు నిర్మించేందుకు ఎస్టీ ఎస్‌డీఎఫ్ పథకం కింద రూ.120 కోట్లు, లోకేశ్వరం మండలంలోని పురాతన అర్లి(టి) వంతెన నిర్మాణానికి రూ.46 కోట్లు, మెడికల్ కాలేజీ ఏర్పాటుకు రూ.166 కోట్లను.. ఇలా వివిధ అభివృద్ధి పనుల కోసం కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేసింది. ఇంతలో అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడం, కాంగ్రెస్ సర్కారు అధికారంలోకి రావడంతో అభివృద్ధి పనులు నిలిచిపోయాయి. ఇలా కేసీఆర్ సర్కారు మంజూరు చేసిన నిధులు, పనులను కాంగ్రెస్ ప్రభుత్వం ఎక్కడికక్కడ నిలిపివేస్తూ రాజకీయ కోణంతో ఆటంకాలు సృష్టిస్తుండడం విమర్శలకు తావిస్తున్నది. అధికారులకు అంతర్గతంగా ఆదేశాలివ్వడం విశ్వసనీయంగా తెలిసింది.

- లోకేశ్వరం మండలంలోని లోకేశ్వరం, కుంటాల, నర్సాపూర్ (జి) మండలాలను అనుసంధానించే పురాతన అర్లి(టి) వంతెన నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.46 కోట్లను మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి, స్థానికుల విజ్ఞప్తి మేరకు నిర్ణయం తీసుకున్నారు. కానీ.. బీఆర్‌ఎస్ సర్కారుకు క్రెడిట్ దక్కుతుందన్న అసూయతో కాంగ్రెస్ ప్రభుత్వం పనులు చేపట్టవద్దని సంబంధిత శాఖ అధికారులను ఆదేశించినట్లు సమాచారం.
- నిర్మల్ జిల్లా కేంద్రంలో కేసీఆర్ ప్రభుత్వం మెడికల్ కాలేజీ ఏర్పాటుకు రూ.166 కోట్లను మంజూరు చేయడమే కాకుండా, స్థానిక జిల్లా ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. తరగతులు కొనసాగుతున్న తరుణంలో నిధుల కేటాయింపు విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వం వెనుకడుగు వేస్తుండడంపై సర్వత్రా విమర్శలకు కారణమవుతున్నది. ప్రస్తుతం 200 పడకల ఆసుపత్రి కోసం నిర్మించిన భవనంలో మెడికల్ కాలేజీ కొనసాగుతుండడంపై విద్యార్థులు అసౌకర్యానికి గురవుతున్నారు. మెడికల్ కాలేజీకి సొంత భవనం నిర్మించాలని, తరగతి గదులు, లేబోరేటరీ, అన్నిరకాల మౌలిక సదుపాయాలను సమకూర్చాలంటూ ప్రస్తుతం ఇక్కడ ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. కాగా.. మెడికల్ కళాశాల నిర్మాణ పనులను మొదలు పెట్టవద్దని సంబంధిత శాఖ అధికారులకు ప్రభుత్వ పెద్దల నుంచి ఆదేశాలు వచ్చినట్లు తెలుస్తున్నది. కొత్తగా ఏర్పడ్డ ప్రభుత్వం విద్యార్థుల డిమాండ్లు, మారుమూల గిరిజనుల సమస్యలు, ప్రజల అవసరాలను పట్టించుకోకుండా కేవలం రాజకీయ కోణంతోనే అణచివేయాలన్న దురుద్దేశంతోనే అభివృద్ధికి అడ్డంకులు సృష్టిస్తున్నదని వాపోతున్నారు. ఇలా జిల్లా వ్యాప్తంగా దాదాపు రూ.400 కోట్లకు పైగా నిధులతో చేపట్టాల్సిన వివిధ అభివృద్ధి పనులను గత కేసీఆర్ ప్రభుత్వం మంజూరు చేయగా, ఆయా పనులన్నింటిని నిలిపివేయాలంటూ ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ఆదేశించినట్లు సమాచారం.


నిర్మల్‌లో 200 పడకల ఆసుపత్రి భవనంలో కొనసాగుతున్న మెడికల్ కాలేజీ

### సర్కారు తీరుపై విమర్శలు

వానకాలంలో వాగులు, వంకలు ఉప్పొంగినప్పుడు ఆయా గ్రామాలకు బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో మారుమూల పల్లెలకు కనెక్టివిటీ పెంచి, గిరిజనులు, ఆదివాసుల అభివృద్ధికి బాటలు వేయాలన్న ఉద్దేశంతో కేసీఆర్ ప్రభుత్వం షెడ్యూల్డ్ ట్రైబ్ స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్(ఎస్టీఎస్‌డీఎఫ్) కింద రూ.120 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో కొత్త రోడ్లు వేయాల్సిన కాంగ్రెస్ ప్రభుత్వం.. ఎలాగైనా సరే ఈ పనులను నిలిపివేయాలని ఆదేశించడంపై ప్రజలు మండిపడుతున్నారు.